క్లుప్తంగా

వేడుకగా మహాకుంభాభిషేకం

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని సిద్ధి విఘ్నేశ్వరాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహాకుంభాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పవిత్ర పినాకినీ నదీ తీర్థగ్రహణం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మహాలక్ష్మిపూజ, అగ్నిప్రతిష్ఠ, తదితరాలను ఆలయ ప్రధానార్చకుడు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. స్వామివారి పూలదర్బార్ సేవను సాయంత్రం నిర్వహించారు. సంతపేటలోని లక్ష్మీనారాయణ కోలాట మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనను జరిపారు. ఏకాంతసేవను నయనానందకరంగా నిర్వహించారు. నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, పాండురంగ అన్నదాన సమాజ నిర్వాహకులు నరసింహారావు, వైభవ్ శ్రీనివాస్, శ్రీనివాసులు, బాలాజీ, శేఖర్, సిద్ధి విఘ్నేశ్వరాలయ కమిటీ నిర్వాహకులు లీలామోహన్, అనిల్, సత్యం, కిషోర్, సురేష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

నెల్లూరు (దర్గామిట్ట): అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ జేఏసీ అమరావతి నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాను మంగళవారం చేపట్టారు. ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, జిల్లా నేతలు మురళి, శరత్‌బాబు, బాబూరావు, రాజేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నేతల నిరసన

నెల్లూరు (టౌన్): పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్న కేంద్రం వద్ద నిరసనను ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వెంటనే వీటిని ఎత్తేయాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, సెక్రటరీ రమేష్, హజరత్, పిచ్చిబాబు, దశరథరాములు, వేణుగోపాల్, రియాజ్, ఆదినారాయణ, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, దినేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎస్పీకి తెలియజేశారు.

దేవదాయ శాఖ కమిషనర్‌తో భేటీ

నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను విజయవాడలోని ఆయన కార్యాలయంలో తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి మంగళవారం కలిశారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనల మేరకు దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనుల నిర్వహణకు సంబంధించి వివరించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

'కార్పొరేటర్లను అరెస్ట్ చేయాలి'

నెల్లూరు(క్రైమ్): తనతో అనుచితంగా ప్రవర్తించిన కార్పొరేటర్లను వెంటనే అరెస్ట్ చేయాలని మేయర్ స్రవంతి కోరారు. ఈ మేరకు సహచర కార్పొరేటర్లు, గిరిజన సంక్షేమ సంఘ నేతలతో కలిసి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు.

ఆనం వివేకాకు నివాళి

నెల్లూరు(బారకాసు): మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఏసీనగర్‌లోని సమాధుల వద్ద ఆయన చిత్రపటానికి ఆనం రంగమయూర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు, రాఘవరెడ్డి, రమణారెడ్డి, మునవీర్, షమీమ్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం గెంటివేత

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నాన్ని తీసుకురాలేదని ఇంటి నుంచి భార్యను గెంటేసిన భర్తపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వీవర్స్‌కాలనీకి చెందిన మహేశ్వరికి కావలికి చెందిన శ్రీనివాసులుతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబసభ్యులు రూ.లక్ష నగదు, ఆరు సవర్ల బంగారు ఆభరణాలను కట్నం కింద ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. మద్యానికి బానిసైన శ్రీనివాసులు అదనపు కట్నాన్ని తీసుకురావాలంటూ ఆమెను రోజూ వేధించేవారు. ఇవ్వకపోతే మరో వివాహం చేసుకుంటానని బెదిరించసాగారు. ఈ తరుణంలో ఈ ఏడాది జనవరిలో ఆమెను ఇంటి నుంచి గెంటేశారు. పెద్దమనుషుల సమక్షంలో భర్తను కలిసేందుకు బాధితురాలు పలుమార్లు యత్నించినా ప్రయోజనం లభించలేదు. దీంతో భర్తపై చర్యలు చేపట్టాలని నవాబుపేట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న బ్రిజిత

నెల్లూరు(అర్బన్): మలేరియా రహిత జిల్లాగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి బ్రిజిత పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి సంతపేటలోని గుప్తా పార్క్, తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీని నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, వైద్యశాఖ సిబ్బంది మంగళవారం నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిజిత మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవిత్ర, డాక్టర్లు ప్రమోద్, సునీల్, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డెమో అధికారి శ్రీనివాసరావు, వైద్యశాఖ ఉద్యోగి కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

• మలేరియాను నిర్మూలిద్దామని మెడికల్ ఆఫీసర్ జిజియాబాయి పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాఫర్ సాహెబ్, రైతుబజార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీని డాక్టర్లు, సిబ్బంది నిర్వహించారు. డాక్టర్లు సునీల్‌బాబు, డాక్టర్ మిస్బా సుల్తానా, కమ్యూనిటీ ఆర్గనైజర్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

• మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తూ కోటమిట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీని డాక్టర్లు, సిబ్బంది నిర్వహించారు. డాక్టర్లు రూపసాయిశ్రీ, ఆశ్రిత, సీఓ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యులుకు పూజలు






నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో శంకరభగవత్పాదుల జయంతి వేడుకలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలను నిర్వహించారు. స్వామి సమయానందనాథ, చక్రాల ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనందకుమార్, మేనేజర్ వెంకటలక్ష్మీనరసింహం, శ్రీకాంత్‌శర్మ, శ్రీహరిప్రసాద్‌రావు, సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

• వైశాఖ శుక్ల పంచమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరం, అష్టలక్ష్మి ఆలయంలో శంకరజయంతి, జయలక్ష్మి మాత ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. లక్ష్మీకామాక్షి బృందంతో సౌందర్యలహరి పారాయణం, సత్సంగం, జయలక్ష్మి మాత ఆరాధన, లక్ష కుంకుమార్చన, తదితరాలను జరిపారు. నాగేశ్వరస్వామికి అన్నార్చన, ఆంజనేయస్వామికి విశేషాలంకారం, స్వర్ణమహాలక్ష్మికి పూజా కార్యక్రమాలు చేశారు. గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

• మూలాపేటలోని శంకరమఠంలో ఆదిశంకర జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన పూజ, వేదపారాయణం, సౌందర్యలహరి పారాయణాన్ని జరిపారు. ఉభయకర్తలుగా సత్యనారాయణ, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

• ఆదిశంకరాచార్యులు తపస్సే సౌందర్యలహరి అని ఉపన్యాస కేసరి, విజయవాడకు చెందిన మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వివరించారు. నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఆదిశంకర జయంత్యుత్సవాలను పినాకినీ విద్యాపీఠ ఆధ్వర్యంలో ప్రారంభించారు. తొలి రోజు సౌందర్యలహరి వైశిష్ట్యాన్ని వివరించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శంకరభగవత్పాదులవారికి పుష్పార్చనలు, తదితరాలను నిర్వహించారు. అనంతరం శ్రీమన్నారాయణమూర్తిని సత్కరించారు. పినాకినీ విద్యాపీఠ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటలక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి అజయ్‌కుమార్, ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో భగవద్రామానుజాచార్యులు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో పది రోజులుగా నిర్వహిస్తున్న భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గొడుగుల ఉత్సవం, మంగళశాసనోత్సవం, తిరుమంజనాన్ని నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామికి పెద్దశేషవాహనోత్సవం, భగవద్రామానుజాచార్యులుకు చిన్నశేషవాహనోత్సవాన్ని జరిపారు. ఉభయకర్తలుగా కుమారస్వామిరెడ్డి, లక్ష్మమ్మ దంపతులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట విజయ్‌రెడ్డి వ్యవహరించారు.

• తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన ఎదురుగా ఉన్న భగవద్రామానుజాచార్యులు విగ్రహాన్ని పూలమాలతో అలంకరించారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రమాదేవి, జయప్రకాష్, కేశవులు, సుధీర్, రమేష్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

• కొండాయపాళెం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో భగవద్రామానుజాచార్యులు జయంతిని నిర్వహించారు. శ్రీవత్సల శిష్యబృందంతో భక్తి గీతాలను ఆలపించారు. సుభద్రాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ విద్యాసంస్థలను కాపాడాలని వినతి



నెల్లూరు (టౌన్): వీఆర్ విద్యాసంస్థలను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. వీఆర్సీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వీఆర్ కళాశాలలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డు, సైకిల్ స్టాండ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష, నేతలు కిరణ్, సంతోష్, నరేంద్ర, సిసింద్రీ, బాబీ, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

కారులోని నగదు అపహరణ

నెల్లూరు(క్రైమ్): కారులోని నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మాగుంట లేఅవుట్‌కు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి నగరంలోని వెంకట్రామాపురంలో వీ స్క్వేర్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఆక్వా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి రూ.మూడు లక్షలను తీసుకొని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి షాపు మూశారు. నగదును కారులో పెట్టారు. ఫోన్‌ను షాపులో మర్చిపోవడంతో దాన్ని తీసుకొని కారు వద్దకు వచ్చిచూడగా నగదు కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న షఫీ తన కేటీఎం డ్యూక్ బైక్‌ను ఇంటి ముందు ఆదివారం రాత్రి నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి బైక్ అదృశ్యమైంది. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): చెక్కు బౌన్స్ కేసులో వ్యక్తిని కోర్టు ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బనగానపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని గాంధీవీధిలో నివాసం ఉంటున్న నాగ శశిధర్‌సింగ్ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన నాగేశ్వరరావు వద్ద నగదును అప్పుగా తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రామిసరీ నోట్, చెక్కును ఇచ్చారు. అయితే చెక్కు బౌన్స్ కావడంతో బనగానపల్లి కోర్టును నాగేశ్వరరావు ఆశ్రయించారు. నోటీసులు పంపినా నాగశశిధర్ సింగ్ స్పందించకపోవడంతో అరెస్ట్ వారెంట్‌ను కోర్టు జారీ చేసింది. అక్కడి పోలీసులు నెల్లూరు చేరుకొని నవాబుపేట పోలీసులకు సమాచారం అందించి ఆయన్ను అరెస్ట్ చేసి తమ వెంట తీసుకెళ్లారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలి



నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టార్ వైస్ ప్రెసిడెంట్ సుజాత కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్‌ను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ మస్తాన్‌రావు



నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పన్నుల వసూళ్లు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నుల వసూళ్లను వేగవంతంగా చేసి.. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ విభాగాధికారి చెన్నుడు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరులోపు 25 శాతం మేర పన్నులను వసూలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు రూ.11 కోట్ల పన్నులను వసూలు చేశారని, నెలాఖరులోపు మరో రూ.తొమ్మిది కోట్లను వసూలు చేయాలని ఆదేశించారు. భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్, రైతుబజార్ సబ్‌స్టేషన్ల పరిధిలో గల పెన్నార్, బోడిగాడితోట ఫీడర్లలో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

• ఎన్టీఆర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ సరస్వతీనగర్ ఫీడర్‌లో నూతన వైర్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో మోడరన్ స్కూల్, సరస్వతీనగర్, రాయపుపాళెం, షాదీమంజిల్, రామచంద్రాపురం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ పేర్కొన్నారు.

కానిస్టేబుల్ మృతి

నెల్లూరు(క్రైమ్): కేన్సర్‌తో బాధపడుతూ కానిస్టేబుల్ రాము ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మాదరాజుగూడూరులోని పల్లెపాళేనికి చెందిన రాము వెంకటాచలం పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కేన్సర్ వ్యాధితో కొంతకాలంగా చెన్నైలోని అపోలో హాస్పిటల్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆయన మృతికి ఏపీ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారుడు శ్రీహరి సంతాపం తెలియజేశారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు (టౌన్): నగరంలోని సరస్వతీనగర్‌లో గల కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్ టీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నేత జాలిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాసు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులో ఉన్న ఆదిశంకరాచార్యులు మఠంలో మంగళవారం 45వ బ్రాహ్మణ సామూహిక ఉపనయనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ నేత మాలేపాటి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు జయంతి సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉపనయనాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఫణి, సురేష్, పరమేశ్వరరావు, రఘునాథయ్య, బాలు, గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీని ఎప్పుడో మర్చిపోయారు


మాట్లాడుతున్న వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీని ప్రజలు ఎప్పుడో మర్చిపోయారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీకి జనాలు కరువై.. కూలికి నెల్లూరు నుంచి పలువుర్ని తీసుకొచ్చి మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తిరిగితే పది మంది కూడా రావడంలేదని ఎద్దేవా చేశారు. వెంకటాచలం మండలం యర్రగుంటకు చెందిన ముగ్గురు వ్యక్తులు నెల్లూరులో ఉంటున్నారని, వీరికి ఇంటి స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేటాయించారని చెప్పారు. వీరితో పాటు అద్దెకు జనాలను తీసుకొచ్చి 135 మంది టీడీపీలో చేరారని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. వీరిలో ముగ్గురు మినహా మిగిలిన వారికి నియోజకవర్గంలో ఓటు హక్కు ఉందనే విషయాన్ని నిరూపిస్తారానని పలుమార్లు సవాల్ విసిరినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సర్వేపల్లిలో సోమిరెడ్డికి టికెట్ ఇచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. మంత్రిగా బాధ్యతల్లో తలమునకలవుతూనే.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. పార్టీ నేతలు శివప్రసాద్, సురేష్‌రెడ్డి, మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, వెంకటాచలం జెడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోపు నాడు – నేడు పనుల పూర్తి


పనులను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు – నేడు పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీ, కర్లాలమిట్ట, ఫతేఖాన్‌పేట ప్రాంతాల్లోని మున్సిపల్ పాఠశాలల్లో జరుగుతున్న నాడు – నేడు పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి సమీపంలోని బాహుబలి హోటల్లో బిల్లుల అంశాన్ని పరిశీలించారు. కస్టమర్‌కు బిల్లు ఇచ్చే విషయంలో నిబంధనలను పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని చెప్పారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

చెత్త సేకరణ పనుల్లో నిర్లక్ష్యం తగదని కమిషనర్ పేర్కొన్నారు. ఏసీనగర్‌లోని మెయిన్ రోడ్డులో గల మస్టర్ పాయింట్లను పరిశీలించారు. పన్నులను సకాలంలో డిపాజిట్ చేయాల్సిందిగా సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, డీఈ అనిల్, ఏఈ మాధవి, టీపీఆర్వో ప్రసాద్, ఆరోగ్యాధికారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని మానవసేవే మాధవ సేవ టీమ్ సభ్యులు.. ఆమె అల్లుడు శాంతిభూషణ్‌రెడ్డి, కుమార్తె కళారాణి దంపతుల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘ నేత సుధాకర్‌రావు తెలిపారు. సభ్యులు పరిమళ, రవి, శ్రీనివాసులు, కిషోర్, శిరీష, అఖిల్‌కుమార్‌రెడ్డి, సుందరం, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల నిరసన



నెల్లూరు (వేదాయపాళెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ నగరంలోని తడికలబజార్ సెంటర్‌లో కార్మిక సంఘాల నేతలు నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నగర కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం నేత సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి


దేశ్‌కుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య కేంద్ర వైద్యుడు దేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. కుక్క కాటుకు టీకా, ఈసీజీ, అల్ట్రా సౌండ్, తదితర సౌకర్యాలున్నాయని తెలిపారు.

ఆదిశంకరాచార్యులు జయంతి



నెల్లూరు (వేదాయపాళెం): జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి మహోత్సవాన్ని నగరంలోని సిరి మల్టీప్లెక్స్ సెంటర్‌లోని నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత శంకరాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటశేషయ్య ఆచారి, గౌరవాధ్యక్షుడు సదాశివయ్య ఆచారి, జానకిరామయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి బాబు, ఉపాధ్యక్షుడు రఘురామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, మహిళాధ్యక్షురాలు మహేశ్వరి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను భక్తిశ్రద్ధలతో మంగళవారం ప్రారంభించారు. తొలి రోజు శంకరజయంతి అలంకారాన్ని నిర్వహించారు. గణపతి పూజ, ఆదిశంకరాచార్యులుకు పూజ, వేదపఠనం, తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా సుబ్బారావు, సత్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

రోటరీ వ్యవస్థాపకుడి విగ్రహావిష్కరణ

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ క్లబ్ నెల్లూరు ప్రాంగణంలో రోటరీ ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు పాల్ హరీష్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. విగ్రహ దాత, పంజాబ్‌కు చెందిన డిస్ట్రిక్ట్ పాస్ట్ రోటరీ గవర్నర్ భాగ్‌సింగ్ పన్నూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భాగ్‌సింగ్‌ను సత్కరించారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగసతీష్‌బాబు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భరత్‌కుమార్‌రెడ్డి, రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, సమీవుల్లా, సహాయ కార్యదర్శి ఉదయభాస్కర్, సనత్‌కుమార్‌రెడ్డి, దయానంద్, సత్యనారాయణ, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.